# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఆధునిక హంగులు

## ప్రస్తుతం అరకొర సౌకర్యాలతో అద్దె ప్రాతిపదికన కొనసాగింపు

## ఇప్పటికే స్థలం కేటాయించిన ప్రాంతాల్లో శాశ్వత భవనాలు

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో కదిలిన అధికారులు

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త :** తెలంగాణలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆధునిక శోభను సంతరించుకోనున్నాయి. ప్రస్తుతం అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్న ఈ కార్యాలయాలు ఇకపై కార్పొరేట్ స్థాయిలో ప్రజలకు సేవలు అందించనున్నాయి. రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నింటినీ ఆధునీకరించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆదేశించారు. దీంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగర శివార్లలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు చాలా ఏళ్లుగా అద్దె ప్రాతిపదికన పురాతన భవనాలలో కొనసాగుతున్నాయి. కొన్ని జిల్లా కేంద్రాలలో సైతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. వీటిలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్లు, సర్టిఫికెట్లు వంటి పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక ఆదాయం తెచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోకి ప్రస్తుతం వికలాంగులు, వృద్ధులు వెళ్లాలంటే వెళ్లలేని పరిస్థితి ఉంది. మరుగుదొడ్లు, తాగునీటి వసతులు కూడా లేవు. దీంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి ంది. ఒకవేళ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సర్వర్ పని చేయకపోతే ఇక అంతే సంగతులు. చాలా చోట్ల కార్యాలయాలు ఇరుకుగా ఉంటున్నాయి,. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరించాలని జారీ చేసిన ఆదేశాలతో ఇక ప్రజల సమస్యలు తీరనున్నాయి. కాగా, అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్న కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇప్పటికే స్థలం కేటాయించిన ప్రాంతాల్లో శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో కలిపి మొత్తం 143 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, వాటిలో అత్యధికంగా రాజధాని హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పరిధిలోనే ఉన్నాయి.

హైదరాబాద్ నగరంలో 11, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 34 ఉన్నాయి. మరోవైపు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా ఆదాయం పెంచాలని తమపై ఒత్తిడి తెస్తున్న ప్రభుత్వాలు తమకు సౌకర్యాలు కల్పించడంపై శ్రద్ధ చూపించడం లేదని ఎస్సార్వో సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని చాలా వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది.

రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగులు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. దీంతో వారు ఇదే అదనుగా కార్యాలయాలకు రిజిస్ట్రేషన్ పనుల నిమిత్తం వచ్చిన ప్రజల నుంచి అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇప్పటికైనా అన్ని వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

# గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్ష వాయిదా వేయాలి

## ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** గ్రూప్1 ప్రిలిమ్స్ పరీక్ష వాయిదా వేయాలని బిఆర్ఎస్ నేత ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. జూన్ 9న పరీక్ష నిర్వహించొద్దని... అదే రోజున ఇంటెలిజెన్స్ బ్యూరో పరీక్ష కూడా ఉందని తెలిపారు.

చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్1కు సన్నద్ధం కాలేదని చెప్పారు. వారి కోసం నెల రోజుల సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

## నేడు గవర్నర్‌తో సిఎం రేవంత్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం ఉదయం కలువనున్నారు. ఉదయం 10 గంటలకు సిఎం రాజ్‌భవన్‌కు వెళ్లనున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్స వేడుకలకు ఆయనను ఆహ్వానించనున్నారు.

# ఓవైపు మండుతున్న ఎండలు, మరోవైపు వర్ష సూచనలు

## నేడు, రేపు మోస్తరు వర్షాలు,

## పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు

## 16 జిల్లాల్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు,


## కరీంనగర్‌లో వడదెబ్బతో ఇద్దరి మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 31:** రాష్ట్రంలో ఒకవైపు ఎండల తీవ్రత, మరోవైపు వడగాల్పులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్న వాతావరణం ఇంకా కొనసాగుతోంది. రాష్ట్రంలో జూన్1,2 తేదీల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ సందర్భంగా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. శనివారం కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతవరణ కేంద్రం ప్రకటించింది. నల్లగొండ, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉండటంతో ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. అన్ని జిల్లాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవ్వగా, ప్రధానంగా 16 జిల్లాల్లో మాత్రం 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు రావడం గమనార్హం. వాటిని ఒకసారి పరిశీలిస్తే పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ 47.1, మంచిర్యాల జిల్లా భీమారం 47.1, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గరిమెల్లపాడు 46.9, నల్లగొండ జిల్లా కేతపల్లి 46.8, ఖమ్మం జిల్లా ఖానాపూర్ 46.8, సూర్యపేట జిల్లా మునగాల 46.4, జగిత్యాల జిల్లా నేరెళ్ల 46.4గా రికార్డయింది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ 46.3, ములుగు జిల్లా వెంకటాపురం 46.2, కరీంనగర్ జిల్లా జమ్మికుంట 46, నిర్మల్ జిల్లా బుట్టాపూర్ 46, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా మొగులపల్లి 45.9, కొమురంఅసిఫాబాద్ జిల్లా కుంచవెల్లి 45.9, ఆదిలాబాదన జిల్లా ఆర్లి 45.7, వరంగల్ జిల్లా గొరెకుంట 45.1, సిద్దిపేట జిల్లా కట్కూరు 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఒకవైపు అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాల్పుల తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి చెందారు. కరీంనగర్ జిల్లాలో వడదెబ్బకు ఇద్దరు మృతి చెందారు. శుక్రవారం జిల్లాలోని వీణవంక, చొప్పదండిలో ఎండ తీవ్రత పెరిగి వడగాల్పులు వీయడంతో వేడిమి తట్టుకోలేక మృతి చెందారు. వీణవంక మండల కేంద్రానికి చెందిన కళ్యాణం రామక్క అనే వృద్ధురాలు వడదెబ్బ తగలడంతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మరోవైపు చొప్పదండిలో వడదెబ్బతో లారీ డ్రైవర్ మృతి చెందాడు. పెద్దపల్లి జిల్లా కెసోరాం సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి సిమెంట్ లోడ్‌తో చొప్పదండికి వచ్చిన లారీ డ్రైవర్ జాకీర్ హుస్సేన్(60) ఎండదెబ్బతో తీవ్ర అస్వస్థతక గురై రోడ్డుపై కళ్లు తిరిగి పడిపోయాడు. 108 వాహనం వచ్చే లోపే హుస్సేన్ చనిపోయినట్లు గుర్తించారు.

# భారత్ ఆర్థికవృద్ధి 8.2 శాతం

## ఆర్బీఐ అంచనాలు అధిగమించిన జిడిపి వృద్ధి

## కీలక ఎనిమిది రంగాల్లో వృద్ధి 6.2%



**న్యూఢిల్లీ, మే 31:** భారత్ స్థూల దేశీయోత్పత్తి వృద్ధి 8.2శాతంగా నమోదయింది. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో కూడా ఇదే జోరు కొనసాగుతుందని అంచనా. జనవరి మార్చి త్రైమాసికంలోనే 7.8శాతంగా జిడిపి వృద్ధి నమోదయిందని కేంద్ర అర్థగణాంక, పథక అమలు మంత్రిత్వశాఖ జిడిపి గణాంకాలను ప్రకటించింది. ద్రవ్యలోటు 5.63శాతంగా ఉంది. ఆర్థికసంవత్సరం చివరి త్రైమాసికంలో అంచనాలుమించి జిడిపి వృద్ధినమోదయింది. తయారీ రంగంలో బలమైన వృద్ధినమోదు అయిందని గణాంకశాఖ ప్రకటించింది. పూర్తి ఆర్థికసంవత్సరంలో దలాల్‌స్ట్రీట్ అంచనాలు, ఆర్బీఐ అంచనాలను కూడా జిడిపి వృద్ధి అధిగమించిందని తెలుస్తోంది. శుక్రవారం మంత్రిత్వశాఖ విడుదలచేసిన డేటాచూస్తే స్థూల వాస్తవ విలువలు 2022-23 సంవత్సరంలో 6.7శాతం ఉంటే 2023-24 సంవత్సరంలో 7.2శాతానికి పెరిగింది. ఈ వృద్ధి భారత ఆర్థికవ్యవస్థను 3.5 లక్షల కోట్ల డాలర్లవైపు నడిపించిందని కేంద్ర అర్థగణాంక శాఖ ప్రకటించింది.

రానున్న కొద్దికాలంలోనే భారత్ ఆర్థికవ్యవస్థ ఐదు లక్షలకోట్ల డాలర్లకు చేరుకోడానికి ఉపకరిస్తుందని అంచనావేసారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జనవరి మార్చి త్రైమాసికంలో దేశ జిడిపి 6.2శాతంగా నమోదయింది. పూర్తి ఆర్థికసంవత్సరానికి ఏడుశాతం వృద్ధిరేటు నమోదయింది. 2023-24 ఆర్థికసంవత్సరంలో ద్రవ్యలోటు జిడిపిలో 5.63శాతంగా నమోదయింది. వాస్తవానికి బడ్జెట్‌లో 5.8శాతంగా నమోదుకావచ్చని అంచనావేసారు. వాస్తవ రూపంలో చూసినపుడు ఆదాయం వ్యయం మధ్య వ్యత్యాసం 16.53 లక్షలకోట్లుగా ఉందని డేటా చెపుతోంది. స్థూలంగా పన్నులరూపంలో 23.26 లక్షలకోట్లుప్రభుత్వానికి రాగా వ్యయం 44.42 లక్షలకోట్లుగా ఉంది. రిజర్వుబ్యాంకు తన ఇటీవలి ద్రవ్యసమీక్షలో కూడా జిడిపి వృద్ధి ఏడుశాతంగానే ఉంటుందని వెల్లడించింది. త్రైమాసికాల వారీగా కూడా 7.1శాతం, 7.2శాతంచొప్పున వేసింది. మూడు, నాలుగు త్రైమాసికంలో ఏడుశాతంగానే ఉంటుందని వెల్లడించింది. అలాగే ఎనిమిది కీలక రంగాల్లో ఏప్రిల్ మాసాంతానికి 6.2శాతం వృద్ధి నమోదయింది. విద్యుత్, సహజవాయువు, బొగ్గు, ఉక్కు, రిఫైనరీ ఉత్పత్తులు, ముడిచమురు, సిమెంట్‌రంగాల్లోనే ఈ వృద్ధి గణనీయంగా ఉందని ఎన్ఎస్ఓ ప్రకటించింది.

# మరో ఇద్దరి అరెస్టు

>> అధికారులు మరోసారి దూకుడు పెంచారు. గత జనవరిలో వెలుగు చూసిన గొర్రెల పంపిణీ నిధుల స్వాహా కేసు పశు సంవర్ధక శాఖకు చెందిన పలువురు అధికారుల మెడకు చుట్టుకోవడం తెలిసిందే. తెలంగాణలో మంచి బ్రీడ్ గొర్రెలను రైతులకు అందించేందుకు అప్పటి బిఆర్ఎస్ సర్కారు కొత్త తరహా పథకం ప్రవేశపెట్టగా ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు పశు సంవర్ధక శాఖ అధికారులు వెళ్లి మేలు రకంగా వున్న గొర్రెలను కొని ఇక్కడి రైతులకు సబ్సిడీగా అందించారు. ఇందులో భాగంగా 2023 జులై, ఆగస్టు మధ్య కాలంలో పశు సంవర్ధక శాఖకు చెందిన ఇద్దరు ఎడిలు రవి కుమార్, కేశవచారిలతో పాటు కొండాపూర్‌లోని లోలోనా డిలైవ్ కంపెనీ తరపున దాని అధిపతిగా వున్న కాంట్రాక్టర్ సయ్యద్ మోయిద్ ఎపిలోని పల్నాడు, ప్రకాశం, గుంటూరు జిల్లాలలో పర్యటించి అక్కడి 18 మంది రైతుల నుంచి 133 యూనిట్ల గొర్రెలు (2793 గొర్రెలు) కొనుగోలు చేశారు.

దీని తరువాత ఈ 133 యూనిట్ల గొర్రెలు అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాలలో నెల రోజుల్లోనే డబ్బులు జమ కావాల్సి వుండగా ఈ నిధులు గొర్రెలు అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాలో రెండు నెలల వరకు జమ కాకపోవడంతో వారంతా గత డిసెంబర్ నెల 20వ తేదీన హైదరాబాద్‌కు వచ్చి పశుసం వర్ధక శాఖ కార్యాలయంలో విచారించగా గొర్రెల అమ్మకాలకు సంబంధించిన రెండు కోట్ల పది లక్షల రూపాయలు అప్పటికే రిలీజ్ అయినట్లు తేలింది.

దీంతో తమ వద్ద నుంచి గొర్రెలు కొనుగోలు చేసిన కాంట్రాక్టర్ మోయిద్ కార్యాలయానికి వెళ్లి అతన్ని నిలదీయగా అతగాడు తల బిరుసుగా సమాధానం ఇచ్చాడు. దీనిపై రైతులు విచారించగా తమ ఖాతాల్లో పడాల్సిన డబ్బులను మోయిద్ బినామీలుగా వున్న వారి ఖాతాలో జమా అయినట్లు రైతులు గుర్తించి గత డిసెంబర్ నెల 26వ తేదీన గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌కు వెళ్లి తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేయగా దీనిపై అక్కడి పోలీసులు పశు సంవర్ధక శాఖ ఎడిలు రవికుమార్, కేశవచారి, కాంట్రాక్టర్ మోయిద్‌లపై కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. వీరితో పాటు పశు సంవర్ధక శాఖ నాటి ఓఎస్‌డి కల్యాణ్‌పైనా కేసు నమోదయ్యింది. కాగా ఈ గోల్‌మాల్ వెలుగు చూడక ముందు అంటే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజున ఎసి గార్డ్సలోని పశు సంవర్ధక శాఖ ప్రధాన కార్యాలయం నుంచి కొన్ని ఫైళ్లు గల్లంతు కావడం సంచలనం రేపింది. అప్పట్లో ఈ వార్త రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. దీనిపై నాంపల్లి పోలీసు స్టేషన్‌లో పశు సంవర్ధక శాఖ నాటి ఓఎస్‌డి కల్యాణ్ సహా మరికొందరిపై మరో కేసు నమోదు అయ్యింది. ఈ కేసులో కల్యాణ్ కోర్టు నుంచి ముందస్తు బెయిల్ పొందాడు.

ఈ ఘటన తరువాత తరువాత గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో గొర్రెల పంపిణీ నిధులు రూ. 2.10 కోట్ల గోల్‌మాల్‌కు సంబంధించి కాంట్రాక్టర్ మోయిద్, ఎడిలు రవికుమార్, కేశవచారిలపై కేసు నమోదయ్యింది. నాంపల్లి, గచ్చిబౌలి పోలీసు స్టేషన్‌లో పశు సంవర్ధక శాఖకు సంబంధించి నమోదైన రెండు కేసులకు సంబంధం వుండడం, మొదటి కేసుకు రెండవ కేసుతో సంబంధం వుండడంతో మొత్తం వ్యవహారం పై దర్యాప్తు బాధ్యతలను ఎసిబికి అప్పగిస్తూ సర్కారు గత జనవరి నెలలో ఆదేశాలు జారీ చేసింది.

# పదవి.. విరమణ

## ఎట్టకేలకు ఏపి ప్రింటింగ్, స్టేషనరీ కమిషనర్‌గా

## కీలక బాధ్యతలు చేపట్టిన ఎబివి

## అదే రోజున పదవీవిరమణ కూడా..

## సుదీర్ఘ న్యాయపోరాటంతో తిరిగి పదవి చేపట్టినా ఒక్క రోజులోనే ముగిసిన వైనం

**విజయవాడ,మే31,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు(ఏబీవీ)ను రాష్ట్ర ప్రభుత్వం సర్వీసులోకి తీసుకుంది. ఆయనకు విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమీ షనర్‌గా డీజీ హోదాలో ఆయనకు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. శుక్రవారం ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి విధుల్లో చేరిన ఏబీవీ, ఇదే రోజు పదవి విరమణ చేయనున్నారు. గతంలో ఆయనపై ఏపీ ప్రభుత్వం రెండవ సారి సస్పెన్షన్ వేటు వేసే నాటికి అవే బాధ్యతలను ఆయన నిర్వహిస్తున్నారు. పలు అవినీతి అభియోగాలపై ఏబీవీని ప్రభుత్వం గతంల సస్పెండ్ చేసింది. దాంతో ఆయన క్యాట్‌ను ఆశ్రయించారు. అయితే క్యాట్ ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్ధించింది. దాంతో ఏబీవీ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆయన సస్పె న్షన్‌ను కొట్టివేసింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. అయితే హైకోర్ట్ నిర్ణయాన్ని సమర్దిస్తూ ఆయన వెంటనే పోస్టింగ్ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సర్వీసులో ఉన్న ఉద్యోగిని రెండేళ్ళ కంటే ఎక్కువ సస్పెన్షన్‌లో ఉంచకూడదని సుప్రీం ఈఆదేశాల సందర్భంగా స్పష్టం చేసింది. ఈక్రమంలో ప్రభుత్వం ఆయనను విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమీషనర్‌గా నియమించింది. ఈ పోస్టులో ఆయన చేరిన కొద్ది కాలానికే ప్రభుత్వం అవినీతి ఆరోపణలతో మరల సస్పెండ్ చేసింది. ఎబీవీ క్యాట్‌ను ఆశ్రయించగా ఒక అధికారిని ఒకే కారణంపై రెండు సార్లు సస్పెండ్ చేయడం సరికాదని తెల్చిచెప్పింది. ఆయనపై సస్పెన్షన్ ఎత్తి వేసింది. అయితే ఏపీ ప్రభుత్వం ఈ అంశాన్ని హైకోర్టులో సవాల్ చేసింది. గురువారం అక్కడ ఎబీవీకి అనుకూలతీర్పు వచ్చింది. ఆయనను వెంటనే విధుల్లో చేర్చుకోవాలని ఆదేశించింది. దాంతో ఆయన ఏపీ సీఎస్ జవహర్‌రెడ్డి పోస్టింగ్ కోసం లేఖను ఇచ్చారు. పరిశీలిస్తామని సీఎస్ చెప్పడంతో ఏబీవీ లేఖ ప్రతిని ఏపీ సీఈవోకు ఇచ్చారు. ఈ పరిణామాల నడుమ శుక్రవారం ప్రభు త్వం ఏబీ వెంకటేశ్వరరావుకు విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులను ఇచ్చింది. వాటిని అనుసరించి ఏబీవీ ఈ రోజు ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ వాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమిషనర్‌గా కీలక బాధ్యతలు స్వీకరించిన రోజే పదవీ విర మణ చేయాల్సిన పరిస్దితి వచ్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా వివాదస్పద అంశాలపై మాట్లాడలేనన్నారు. ప్రస్తుతానికి ఇంతవరకే మాట్లాడగలను, ఇన్నా ళ్లుతోడుగా ఉండి ధైర్యం చెప్పిన శ్రేయోభిలా షులకు రుణపడి ఉంటానన్నారు. రెండేళ్ళ కితం ఏ పోస్టులో అయితే అదే పోస్టులో జాయిన్ అ య్యాను. ఇదే రోజు రిటర్మెంట్ అనే విషయాన్ని పక్కనపెడితే, నా కల నేరవేరింది, పోలీసు ఉన్న తాధికారిగా, ఖాకీ దుస్తుల్లోనే పదవి విరమణ చేస్తున్నా అది సంతోషంగా ఉందన్నారు.



శుక్రవారం విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ,స్టోర్స్ పర్చే కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎబి వెంకటేశ్వరరావు

### పదవి విరమణ చేసిన ఏబీ వెంకటేశ్వరరావు

ప్రింటింగ్ అండ్ స్టేషనరీ, స్టోర్స్ పర్చేజ్ కమీషనర్‌గా డీజీ హోదాలో ఈ ఉదయం బాధ్యతలు స్వీకరించి సీనియర్ ఐపీఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు ఈ సాయంత్రమే పదవి విరమణ చేసారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, మిత్రులు, రాజకీయ నాయకులు కలుసుకుని అభినందించారు. వారితో తాను ఉద్యోగ బాధ్యతల్లోనే రిటైర్ కావడం సంతోషంగా ఉందని ఏబీవీ వ్యాఖ్యానించారు. తనపై తీవ్ర ఆరోపణలతో నిబంధనలకు విరుద్దంగా సస్పెండ్ చేసినా న్యాయపోరాటం చేసానన్నారు. తనది ధర్మపోరాటమన్నారు. అందుకే విజయం సాధించానన్నారు. తన పట్ల అభిమానం చూపించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

# తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తరాదికి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, మే 31 ప్రభాతవార్త** దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ నేటి నుంచి ( ఈ నెల 01 నుంచి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ముజఫర్ పూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే నెంబర్ 05295 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 01న శనివారం బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి ముజఫర్ పూర్ వెళ్లే నెంబర్05296 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 03న సోమవారం సికింద్రాబాద్ నుంచి బయల్దేరుతుంది. అలాగే పాట్నా నుంచి మంగళూరు వెళ్లే నెంబర్ 03243 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 01న శనివారం పాట్నా నుంచి బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో మంగళూరు నుంచి పాట్నా వెళ్లే నెంబర్ 03244 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 04న మంగళశారం మంగళూరు నుంచి బయల్దేరుతుంది. ముజఫర్‌పూర్-సికింద్రాబాద్-ముజఫర్‌పూర్‌ల మధ్య తిరిగే నెంబర్ 05295/96 ప్రత్యేక రైళ్లు మార్గ మద్యంలో హాజీపూర్, పాటలీపుత్ర, దానాపూర్, అరా, బక్సర్, మొఘల్ సరాయ్, అలహాబాద్, సత్నా, కత్నీ, జాబ్బల్పూర్, ఇటార్సీ, నాగ్‌పూర్; బల్హార్షా, సిర్పూర్ కాగజ్ నగర్, బెల్లంపల్లి, రామగుండం, పెద్దపల్లి, ఖాజీపేట స్టేషన్‌లలో నిలుస్తాయి.

# పుస్తకాలు మరిచారు

>> విద్యార్థులు నేటి నుంచి కాలేజీలకు వచ్చినప్పటికీ క్లాసులు వినకుండా పునశ్చరణ తరగతులను నిర్వహించుకోవల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

**15 కాలేజీలకు లెక్చరర్లు, సిబ్బంది లేరు..**

రాష్ట్రంలో 427 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. వాటిలో 15 జూనియర్ కాలేజీలకు లెక్చరర్లు, సిబ్బంది లేరు. ఆయా కాలేజీలకు సిబ్బంది మంజూరు కోసం ఇంటర్ విద్య కమిషనరేట్ నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినప్పటికీ ఇప్పటి వరకు సిబ్బంది, లెక్చరర్ పోస్టులను మంజూరు చేయలేదు.

వాటిలో కేవలం ప్రిన్సిపల్ పోస్టులో మాత్రమే రెగ్యులర్ లెక్చరర్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. మిగిలిలన లెక్చరర్లు, సిబ్బందిని ఆయాజిల్లాల డీఐఈవోలు ఇతర కాలేజీల నుంచి అక్కడి పంపించి పనిచేయి స్తున్నారు.

**గెస్టు ఫ్యాకల్టీకి అనుమతించని సర్కార్..**

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను గత ఏడాది రెగ్యులరైజ్ చేసింది.

కానీ గెస్టు ఫాక్యల్టీని మాత్రం రెగ్యులరైజ్ చేయలేదు. రాష్ట్రంలో సుమారు 1600కిపైగా గెస్టు ఫ్యాకల్టీ ఉన్నారు. వారిని ఈ విద్యా సంవత్సరం 2024-25లో తిరిగి తీసుకోవడం కోసం అనుమతి ఇవ్వలేదు. దీంతో గెస్టు ఫ్యాకల్టీ నేటి నుంచి ప్రారంభమయ్యే కాలేజీల్లో బోధనకు వచ్చే అవకాశం లేదు.

పైగా జూన్ 2 వరకు రాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఉన్నాయి. జూన్ 5 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం ప్రారంభం కానుంది.

అది ముగియడానికి కనీసం 10 నుంచి 15 రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. అంటే జూన్ 20 వరకు ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులకు రెగ్యులర్ క్లాసులు ప్రారంభమయ్యే అవకాశం లేనట్టు కనిపిస్తోంది.

# ఎసిబి వలలో ముగ్గురు నీటి పారుదల శాఖ అధికారులు, గండిపేట సర్వేయర్

## అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతుల కోసం లంచం తీసుకుంటుండగా పట్టివేత

**హైదరాబాద్, మే 31, ప్రభాతవార్త:** నీటి పారుదల శాఖకు చెందిన ముగ్గురు అధికారులతోపాటు శివార్లలోని గండీపేట ఎంఆర్ఓ కార్యాలయంలో సర్వేయర్‌గా పని చేస్తున్న ఓ అధికారి లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. గురువారం రాత్రి నగరంలోని రెడ్‌హిల్స్‌లో గల నీటి పారుదల శాఖ కార్యాలయంలో ఈ విభాగం అధికారులు ముగ్గురు పట్టుబడగా ఈ సందర్భంగా తప్పించుకుని పారిపోయిన సర్వేయర్‌ను నాలుగు గంటల అనంతరం ఎసిబి అధి కారులు పట్టుకున్నారు. నాలుగు గంటలకు పైగా సాగిన ఈ ఆపరేషన్ నాటకీయ పక్కీలో సాగగా ఎసిబి అధికారులు సామాన్య ప్రజల వలే వచ్చి లంచాతవతారుల ఆట కట్టించారు. వివరాలు ఇలావున్నాయి. శివార్లలోని నెక్నాంపూర్‌లో నాలా పక్కన గల స్థలంలో అపార్ట్‌మెంట్ నిర్మించేందుకు దాని యజమాని ఉపేంద్రనాథ్ రెడ్డి నిర్ణ యించుకుని అనుమతి కోసం గండీపేట ఎంఆర్ఓ కార్యాలయంలో సంప్రదించగా అక్కడ సర్వేయర్‌గా పనిచేస్తున్న గణేష్ ఇందుకు దండిగా లంచం డిమాండ్ చేశాడు.

ఈ పని తన ఒక్కడి వల్ల కాదని, నీటి పారుదల శాఖ క్లియరెన్స్ కూడా అవసరమని గణేష్ బాధితుడికి చెప్పాడు. దీంతో గణేష్ రెడ్‌హిల్స్‌లోని రంగారెడ్డి జిల్లా నీటి పారుదల శాఖ కార్యాలయంలో పనిచేసే ఈఈ బన్సీలాల్, ఎఈలు కార్తిక్, నిఖేష్ కుమార్‌లను సంప్రదించగా వారు రెండున్నర లక్షల రూపాయల లంచం అడిగాడు.

దీంతో బాధితుడు మొదట లక్షా 50 వేల రూపాయలను నీటి పారుదల శాఖ అధికారులకు ఇచ్చి మిగతా సొమ్మును పని పూర్తయ్యాక ఇస్తానని చెప్పాడు. ఇదే సమ యంలో సర్వేయర్ గణేష్ 40 వేల రూపాయలు తీసుకున్నాడు. కాగా మిగతా లక్ష రూపాయల లంచం విషయమై బాధితుడు నేరుగా ఎసిబి కార్యాలయంలో ఫిర్యాదు చేయగా దీనిపై రంగంలో దిగిన ఎసిబి అధికారులు గురువారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో రెడ్‌హిల్స్‌లో గల రంగారెడ్డి జిల్లా ఎసిబి కార్యాలయంపై నిఘా వుంచారు. బాధితుడు గణేష్ లక్ష రూపాయల నగదును తీసుకుని కార్యాలయంలో వెళ్లి ముగ్గురు అధికారులకు ఇచ్చాడు. దీని తరువాత ఇందులో 65 వేల రూపాయ లను ఈఈ బన్సీలాల్ తీసుకోగా మిగతా సొమ్మును ఎఈలు తీసుకున్నారు. దీని తరువాత అక్కడే వున్న ఎసిబి అధికారులు రెప్పపాటులో దాడిచేసి మొదట ఈఈ బన్సీలాల్‌ను పట్టుకోగా అతని వద్ద 65 వేల రూపాయల లంచం డబ్బులు పట్టుబడ్డాయి. దీని తరువాత ఎఈలను సోదా చేయగా నిఖేష్ కుమార్ వద్ద 35 వేల రూపాయలు దొరికాయి. కాగా ఇదే సదమయంలో అక్కడే వున్న సర్వేయర్ గణేష్ ఎసిబి అధికారుల రాకను గమనించి పారిపోయాడు. అయితే ఎసిబి అధికారుల దాడిలో ఈఈ బన్సీలాల్‌తో పాటు ఎఈలు నిఖేష్ కుమార్, కార్తిక్‌లను అరెస్టు చేయగా పారిపోయిన సర్వేయర్ గణేష్‌ను నాలుగు గంటల పాటు గాలించి అర్థరాత్రి వేళ పట్టు కున్నారు. అయితే ఇతని వద్ద ఎలాంటి లంచం సొమ్ము దొరకలేదు. అయితే ఈ కేసులో నలుగురు కలిసి లంచం డిమాండ్ చేయడంతో నలుగురిని అరెస్టు చేశారు. వీ రిని శుక్రవారం నాంపల్లి ఎసిబి కోర్టులో హాజరు పరచగా ఈ కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులకు రెండు వారాల పాటు రిమాండు విధించారు. అనంతరం నలుగురిని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

